



క్వారీల్లో నిబంధనలకు తూట్లు

◆ ఇష్టం వచ్చినట్లు బ్లాస్టింగ్ ◆ కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని నేమకల్లు గ్రామ పరిధిలో 20 వరకు కంకర క్వారీ మిషన్లు ఉన్నాయి. క్వారీల నిర్వహణకు 300 హెక్టార్ల వరకు ప్రభుత్వ అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటి నిర్వహణకు భూగర్భ అటవీశాఖ కొన్ని నిబంధనలు సూచిస్తోంది. అయితే నేమకల్లు ప్రాంతంలోని క్వారీల నిర్వాహకులు ఈ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ట్రాక్టరు బోరుతో బ్లాస్టింగ్ చేసే సమయంలో 15 అడుగుల లోతువరకు ఒక అడుగుకు మూడు బిట్లు వంతున 20 బిట్లు రంధ్రాలు వేసి అందులో కేబుల్ వేసి పైన రబ్బర్ లాంటి మ్యాట్ వేసి బ్లాస్టింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ నిబంధన మచ్చుకైనా ఆ ప్రాంతంలో కన్పించడం లేదు. 40 అడుగుల వరకు ట్రాక్టర్ బోరు సహాయంతో రంధ్రాలు వేసి అందులో కేబుల్ ఉంచి రబ్బర్ మ్యాట్ లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో గ్రామంలో గృహాలు, పాఠశాల భవనాలు, దేవాలయాల ప్రహరీలు పెద్దపెద్ద శబ్దాలకు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 15 అడుగుల లోతు వరకు బ్లాస్టింగ్ చేస్తే ఎలాంటి నష్టం ఉండదు. అలా కాకుండా 40 అడుగుల వరకు చేస్తుండడంతో సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటితో పాటు సాయంకాలం ఐదు గంటల నుంచి ఏడు గంటలలోపే బ్లాస్టింగ్ చేయాల్సుంది. బ్లాస్టింగ్ జరిపే ముందు స్థానిక రైతులు, గొర్రెల కాపరులకు సమాచారం ఇవ్వాలి. ఈ నిబంధనలను యజమానులు పట్టించుకోవడం లేదు. క్వారీల నుంచి వచ్చే పొగ, దుమ్మూధూళితో పంటలు కూడా నాశనం అవుతున్నాయి. పంట నష్టపోయిన రైతులకు కనీసం క్వారీ యజమానులు రూపాయి కూడా పరిహారం ఇచ్చిన దాఖాలాలు లేవు. క్వారీ నిర్వాహకులు నిబంధనలకు నీళ్లొదిలారంటూ నేమకల్లు గ్రామస్తులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఢిల్లీలోని గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టును సైతం ఆశ్రయించారు. పరిస్థితి ఇలాగే ఉంటే తాము మరింత నష్టపోవాల్సి వస్తుందని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించన క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కంకర క్వారీ మిషన్‌లో యంత్రాలు

మాట తప్పం.. మడమ తిప్పం..!





◆ ఇంటింటికీ వాలంటీర్లతో ప్రచారం
◆ అనుకూల సోషల్ మీడియా కూడా..
◆ అధికార వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీస్తుండటంతో అధికార వైసిపి ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది. సభల రూపంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తుండగా మరోవైపు సైలెంట్‌గా ఇంటింటి ప్రచారానికి తెరలేపింది. వాలంటీర్లు, సోషియల్ మీడియాతోపాటు వివిధ సంక్షేమ పథకాల పేరుతో సేకరించిన సమాచారంతోనూ మొబైల్ ఫోన్ల ద్వారానూ ప్రతి ఓటరును చేరుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. ఇటువంటి కార్యక్రమాన్ని ఇంటింటికీ చేపట్టే పనిలో ఇప్పటికే నిమగ్నమై ఉంది. 'మాట తప్పం..మడమ తిప్పం.' అన్న నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వాలంటీర్లు, సోషియల్ మీడియాను జత కలిపి ప్రజల వద్దకు పంపించే ప్రయత్నాన్ని అధికార వైసిపి చేపడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే ఈ రకమైన ప్రచారాన్ని మొదలు పెట్టింది. సత్యసాయి జిల్లాలో మంగళవారం నాడు ప్రయోగాత్మకంగా ఒక మండలంలో ఇటువంటి ప్రచారాన్ని, సర్వేను చేపట్టినట్టు సమాచారం. వాలంటీరు పరిధిలోని ఇంటింటికెళ్లి వివరాలు సేకరించే పనిని చేడుతున్నారు. అదే సమయంలో వారు ప్రభుత్వం పాలన పట్ల ఏ రకంగా ఉన్నారన్న అంచనాలను



రూపొందిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఏ రకమైన లబ్ధి చేకూరిందన్నది వాలంటీరు ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి రాకపోతే సచివాలయ వ్యవస్థ ఉండకపోతే నాయకుల ఇళ్ల వద్దకు తిరగాల్సి రావొచ్చు అంటూ ఓటర్లను ఆలోచనలో పడేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సమాచారం. వైసిపి మరోమారు అధికారంలోకి వస్తే 'మాట తప్పదు..మడమ తిప్పదు.' అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళుతోంది. ఇలా సైలెంట్‌గా వైసిపి ఎన్నికల ప్రచారాన్ని చేపడుతోంది. దీనికి వాలంటీర్లను వినియోగించుకుని ప్రచారం చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విధంగా బుధవారం నాడు మరో మండలంలో ఈ రకమైన ప్రచారాన్ని నిర్వహించనుంది. వైసిపి ఇప్పటికే నేతల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసింది. గడిచిన రెండేళ్లుగా గడపగడపకూ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రభుత్వ పథకాలు ఏ ఇంటికి ఎన్ని పథకాలు అందాయన్న విషయాన్ని కరపత్రాల రూపంలో వివరంగా తెలియజేశారు. ఈ సమయంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఇప్పుడు ఎన్నికలు సమీస్తుండటంతో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తోంది. నేతలు, వాలంటీర్లు అందరినీ సమిష్టిగా బరిలోకి దింపుతోంది. వీరు కాకుండా గృహ రథ సారథులను నియమించారు. వాలంటీర్లకు ఇద్దరు చొప్పున నియమించారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి వాలంటీర్ల ద్వారా నిర్వహించడం ఇబ్బందయితే గృహ రథసారథుల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని తలపెట్టారు. మొబైల్ ఫోన్లకు నేరుగా ముఖ్యమంత్రి సందేశాలతోపాటు, కార్యక్రమాల వివరాలు ప్రతి ఓటరు చేరుతున్నాయి. సైలెంట్ ప్రచారాలు ఈ విధంగా ఉంటే భారీ బహిరంగ సభలనూ మరోవైపు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 11వ తేదీన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాయలసీమ స్థాయి సభను 'సిద్ధం' పేరుతో చేపట్టనుంది. దీనికి సంబంధించి పెద్దఎద్ద పోస్టర్లు వెలుస్తున్నాయి. ఈ సభకు లక్షల సంఖ్యలో జనసమీకరణ చేపట్టాలని భావిస్తోంది. ఇందుకు ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. రాయలసీమ జిల్లాల అన్నింటి నుంచి భారీగా జనసమీకరణ చేయనుంది. ఇలా అధికార వైసిపి గెలుపే లక్ష్యంగా అన్ని మార్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది.

విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపొద్దు

ఎంవైటి, ఎఆర్ఆర్ విధానాల అమలు సరికాదు-ఇఆర్‌సి ఛైర్మన్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే విధానాలు ఉప సంహరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం విద్యుత్ సంస్థల కమిషనర్‌కు మెయిల్ ద్వారా భారాలు ఉపసంహరించాలని విజ్ఞాపకపత్రాన్ని పంపించారు. అనంతరం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన ఇఆర్‌సి పబ్లిక్ హియరింగ్‌లో ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి వార్షికాదాయ అవసర నివేదిక (ఎఆర్ఆర్)లపై ఐదవ కంట్రోల్ పీరియడ్ సంబంధించిన మల్టీ ఇయర్ టారీఫ్ (ఎంవైటి) పైన ఒకేసారి పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. తొలుత ఎంవైటిని నిర్ధారించి, ఆ ప్రాతిపదికన ఎఆర్ఆర్ చేపట్టడం సమంజసంగా ఉందన్నారు. ఇదే పద్ధతి గతంలో అనుసరించారని తెలిపారు. ఇప్పుడు రెండింటిపై ఒకేసారి హియరింగ్ తీసుకోవడాన్ని మా పార్టీ పక్షాన అభ్యంతరం తెలుపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఈ రెండు అంశాలపై విడివిడిగా పబ్లిక్ హియరింగ్ తీసుకోవాలని కోరారు. ఈ హియరింగ్ మూడు డిస్కంల పరిధిలో ప్రత్యంక్షంగా నిర్వహించి ఉంటే ఉపయోగకరంగా ఉండేదన్నారు. రూ.13,887.28 కోట్లు లోటుగా ఉందని సంస్థలు చూపించాయి. ఈ లోటును పూడ్చడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టంగా ఏం చేస్తుందో చెప్పకుండా 161 జిఓ ప్రకారం లోటు భర్తీ ఉంటుందన్నారు. అయితే డిస్కాంలు ప్రస్తుతం ట్రూఆఫ్ చార్జీలతో పాటు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట యూనిట్‌కు నెలకు 40 పైసల చొప్పున వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. రానున్న ఏడాదిలోనూ అలా చేస్తారా.. అన్నది స్పష్టత లేదన్నారు. అట్టి వసూళ్లను అనుమతించరాదని, ట్రూ ఆఫ్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడు డిస్కాములకు 2024-25 సంవత్సరానికి 83,117.65 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం కాగా 88,507.20 మిలియన్ యూనిట్లు అందుబాటులో ఉన్నందున 5,389.55 మిలియన్ యూనిట్లు మిగులు తెలుతోందని పేర్కొన్నట్లు వివరించారు. అయితే మిగులు విద్యుత్ అమ్మకం గురించి ఏం చెప్పలేదు కానీ, 421.09 మిలియన్ యూనిట్‌ల విద్యుత్‌ను స్వల్పకాలిక కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. మిగులు తేలిన విద్యుత్‌కు ఫిక్సెడ్ ఛార్జీల పేర పెద్ద మొత్తాన్ని ముట్టచెప్పడం, మరోవైపు స్వల్ప కాలిక కొనుగోళ్లలో అధిక ధర చెల్లిస్తున్నారన్నారు. వినియోగదారులపై భారం పడకుండా మిగులు విద్యుత్ అమ్మకం, స్వల్పకాలిక కొనుగోళ్లలో పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు డిస్కాములకు సబ్సిడీగా చెల్లించాల్సిన రూ.22,234.60 కోట్లు బకాయిగా ఉందన్నారు. ఇంత భారీ మొత్తాన్ని ప్రభుత్వం బకాయిపెట్టడంతో డిస్కాములు అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఆ భారం వినియోగదారుపైనే పడుతుందన్నారు. కావున ప్రభుత్వం సకాలంలో బకాయి చెల్లించేలా కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. వ్యవసాయ పంప్‌సెట్లకు వాటిని ఏర్పాటు చేయడానికి సర్కారు ఖజానా నుంచి రూ.వేలకోట్లు అదాని గ్రూప్, షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ ఇంకా కొన్ని ప్రయివేట్ కంపెనీలకు అప్పజెపుతున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయన్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో మూడు సంవత్సరాల్లో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో 250 మందికిపైగా మృతి చెందారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం 20 సంవత్సరాల క్రింద 3 ఎల్‌టీ లైన్‌లను విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేశారని తెలిపారు. హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ పథకం కింద ఎల్‌టీ విద్యుత్ తీగలను 11 కేవీ (హెచ్‌టీ)కి మార్చడం వల్ల లోడును తట్టుకోలేక తీగలు తెగిపడుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాలు ఉమ్మడి జిల్లాలోని 1,070 పీడర్‌ల పరిధిలో అధికారులు సర్వే నిర్వహించారని తెలిపారు. ఈ నివేదికను బహిరంగ పరచాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గినందున విద్యుత్ ఛార్జీలను తగ్గించాలన్నారు. 50 యూనిట్‌ల వరకు కనీస స్లాబ్‌ను పునరుద్ధరించాలన్నారు. నివాసాలకు ఫిక్సడ్ ఛార్జీలు రద్దు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ తరగతులకు 200 యూనిట్‌ల వరకు ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. డిస్కంల లోటు ఎలా భర్తీ చేస్తారో స్పష్టతలేనందున రానున్న రోజుల్లో వినియోగదారులపై భారాలు వేసే అవకాశం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు భారాలు మోపితే ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మన్నిల రామాంజినేయులు, ముస్కిన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా ఎఐబిఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ (ఎఐబిఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం 2వ రోడ్డు బంజారా భవన్‌లో ఏఐబిఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడకల్లో ఏఐబిఎస్ఎస్ వ్యవస్థాపకుడు పూజారి రంజిత్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్-ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.బాలాజీ నాయక్, రాష్ట్ర నాయకులు ఎంఆర్.రంగ్లా నాయక్, శేఖర్ నాయక్, క్రిష్ణా నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణబాయి, శివమ్మ, ఉపాధ్యక్షులు శంకర్ నాయక్, జాయింట్ సెక్రటరీ అర్జున్ నాయక్, ఈశ్వరిబాయి, యూత్ వింగ్ ప్రెసిడెంట్ రామాంజినేయులు నాయక్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ నాయక్, ప్రచారం బాద్యులు శ్రావణ్‌కుమార్ నాయక్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గోవిందు నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎఐబిఎస్ఎస్ వ్యవస్థాకులు రంజిత్‌నాయక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మండల సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : మాదిగలను అవమానపరిచే రీతిలో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తూ భూముల రికార్డులు తారుమారు చేసి ప్రజలకు అన్యాయం చేస్తున్న అనంతపురం మండల సర్వేయర్ ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్‌డిఓ గ్రంధి వెంకటేష్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేయర్ ప్రతాప్‌రెడ్డి ముడుపులకు కక్కుర్తిపడుతూ రికార్డులు తారుమార్లు చేస్తూ సమస్యలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. కురుకుంట సర్వేనెంబర్ 41-1, 41-3, 41-బిలో గత కాంగ్రెస్ ప్రభుత్వం 278 దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే 10 ఏళ్ల తర్వాత ఆ భూమి తమదంటూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి దళితులు ఏర్పాటు చేసిన బండలు తొలగించి ప్రహరీ నిర్మించారన్నారు. తప్పుడు ధృవ పత్రాలు సృష్టించి దళితులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇందుకు సహకరించిన సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలే..విజయానికి సోపానాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-పుట్లూరు

ముఖ్యమంత్రి జగన్ పార్టీలకతీతంగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే వైసిపి విజయానికి సోపానాలు అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని మడుగుపల్లిలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, ఎల్లుట్లలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి కేవలం జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. అయితే సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కూటములు కట్టుకుని వచ్చినా జగన్న పథకాలే తిరిగి వైసిపిని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, జడ్పిటిసి, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, నాయకులు

అగ్రి అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ మృతికి నివాళి

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి (67) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఈయన బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలువురు మంగళవారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా మంగళవారం వజ్రకరూరు మండలం కమలపాడు గ్రామంలో మృతిచెందిన రాజశేఖర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, సతీమణి భువనేశ్వరి, కుమారుడు యువనేత వై.ప్రణయ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



అగ్ని అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

చేనుకు చీరల సింగారం

పంట పొలాలకు రక్షణగా చీరలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల వ్యాప్తంగా రైతులు తమ వ్యవసాయ పంటలకు పశువులు, అడవి పందులు, జంతువుల నుంచి కాపాడుకునేందుకు తమదైన శైలిలో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలో ఎక్కువగా వ్యవసాయ భూములు ఆరుబయలుగా ఉంటాయి. గ్రామ పరిసరాల్లో ఉండే పంట పొలాలకు పశువులు, అడవి జంతువుల వల్ల ముప్పు వాటిళ్లకుండా పంటల చుట్టూ చీరలు కట్టిన దృశ్యాలు అందరినీ ఆకర్శిస్తున్నాయి. పచ్చని పంట పొలాలను రంగురంగుల చీరలతో సింగారించినట్లుగా ఉంది. పచ్చగా ఎదుగుతున్న పంట పైరుగాలికి ఆ చీరలు ఊగుతూ అడవిలో పచ్చని పొలం ఉన్న ప్రాంతాన్ని శోభాయమానం చేస్తున్నాయి. వీటికితోడు రాత్రి పూట జంతువులు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను పాడు చేయకుండా రక్షణ కల్పిస్తున్నాయి. ముఖ్యంగా అటవీ సమీప పొలాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, తదితర పైర్లను వన్యప్రాణుల నుంచి రక్షించుకునేందుకు అన్నదాతలు చీరలను వాడుతున్నారు. పంటల చుట్టూ వీటిని కట్టడం వల్ల జంతువులు దూరం నుంచి మనుషులు ఉన్నట్లుగా భ్రమిస్తాయని రైతులు చెబుతున్నారు.



మొక్కజొన్న పంటకు రక్షణగా చీరలు కట్టిన రైతులు



గ్రంథాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి, తదితరులు



వైసిపి కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మహాత్మా గాంధీకి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాంతి, సమానత్వం అసమానతలు లేని సమాజ స్థాపనకు బాటలు వేసిన స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీ ఆశయాలను సాధిద్దామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్, రామాంజనమ్మ, కావేరి, బాషా, మల్లికార్జున, బాలచంద్ర, సరస్వతి, నాగమణి, శ్రీవిజయ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లాకేంద్రంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి శంకరనారాయణ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామీణుల చెంతకే పాలనను తీసుకొచ్చిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎడిసిసిబి ఛైర్మన్ మానుకుంట లిఖిత, నాయకులు మీసాల రంగన్న, హరీష్‌యాదవ్, మునీరా, పాతూరు మంజునాథ్, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, గుజ్జల శివయ్య, బలరాం, చిదంబరరెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, కుమ్మర ఓబులేసు, సాకే ఆంజనేయులు, యల్లనూరు ప్రసాద్, శివారెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా హిందీ ఉపాధ్యాయులు జూటూరు షరీఫ్ విద్యార్థులకు విద్యా సామగ్రి, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, కృష్ణవేణి, శశికళ, నాగరాజు, పవిత్ర, ఉమామహేశ్వరరెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని మెయిన్ బజార్ కూడలిలో ఉన్న విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్, విగ్రహ దాత కుటుంబ సభ్యులు సుబ్రమణ్యం, సంఘం ప్రతినిధులు వాసు, సుదర్శన్, వెంకట రమేష్, లక్ష్మీనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని గడేకల్ గ్రామ సచివాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఏపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షులు స్వర్ణం, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయిబాబు, కోశాధికారి ఫకృద్దీన్, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేష్, షేక్షావలి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక సభ్యులు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి జైలు అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు.

రక్తదాత వీరన్నకు భారత సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి-రాయదుర్గం



రక్తదాత వీరన్నకు భారత సేవారత్న పురస్కారం అందజేస్తున్న తానుబెల్లి ఫౌండేషన్ సభ్యులు

రాయదుర్గం ప్రాంతానికి చెందిన రక్తదాత ఎంజి వీరన్నకు భారత సేవారత్న పురస్కారం లభించింది. ఇటీవల విశాఖ నగరంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో తానుబెల్లి ఫౌండేషన్ సంస్థ రజతోత్సవాల సందర్భంగా దక్షిణ భారత దేశ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు భారత సేవారత్న పురస్కారాలు అందజేసింది. ఇందులో భాగంగా వీరన్నకు పురస్కారంతోపాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రక్తసంబంధం, వివిధ సామాజిక మాధ్యమ గ్రూపుల్లో రక్తం కోసం సంబంధించి విజ్ఞప్తులు రాగా స్పందించి అక్కడే రక్తం ఏర్పాటు చేయడం, 63 సార్లు తాను స్వయంగా రక్తదానం చేశారు. ఈ సేవలను గుర్తించిన తానుబెల్లి ఫౌండేషన్ ఈరన్నకు పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ తాను ఎప్పుడూ, ఏ సమయంలో పిలిచినా వచ్చి రక్తదానం చేస్తున్న రక్తదాతలు, సేవా కార్యక్రమాలకు ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు తాత్కాలిక తహశీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల



ప్రారంభానికి సిద్ధమైన ప్రభుత్వ పాఠశాల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు తహశీల్దార్ హరికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ కార్యాలయం పూర్తి శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఇబ్బందులపై ప్రజాశక్తి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు ఎట్టకేలకూ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరం. దీంతో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వామపక్షాల నాయకులు

పంచాయతీ పన్నులు తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-పామిడి

పంచాయతీ పరిధిలో వివిధ రకాల పన్నులను తగ్గించాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామిడి నగర పంచాయతీ ఉన్నప్పుడు నీటి పన్ను ఆరు నెలకొకసారి రూ.420, సంవత్సరానికి రూ.840 మాత్రమే వసూలు చేసేవారన్నారు. అయితే 2021 నవంబర్‌లో తిరిగి పామిడి గ్రామ పంచాయతీగా మార్చారన్నారు. అయితే రెండేళ్ల నుంచి నీటి పన్ను గానీ, ఇంటి పన్ను గానీ వసూలు చేయలేదన్నారు. అయితే 2023 డిసెంబర్ నుంచి సంవత్సరానికి రూ.840 ప్రకారం పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని కట్టాలని నోటీసులు ఇచ్చారన్నారు. వెంటనే ఆయా పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనిమిరెడ్డి, సిపిఐ నాయకులు రహీం, నాగరాజు, అస్లాం బాషా, గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం : ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నాయకులు, కార్యకర్తలందరం కలిసికట్టుగా పని చేసి వీరాంజనేయులును గెలిపించుకుందామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టిక్కెట్ తనకు ఇచ్చినా.. ఇవ్వకపోయినా జగనన్న మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. సిఎం జగనన్న మాటకు కట్టుబడి ఆయన నియమించిన వీరాంజనేయులును నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆశీర్వదించాలన్నారు. తప్పనిసరిగా నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు ఎన్.వి.నారాయణ, మండల కన్వీనర్ అంకే నరేష్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, మండల కన్వీనర్ వరకూటి కాటమయ్య, గంగరాజు, రామచంద్రారెడ్డి, నాగలింగ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం కమిషనర్‌గా షేక్‌మాలిక్



రాయదుర్గం : రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా షేక్‌మాలిక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న షేక్ మాలిక్‌ను రాయదుర్గానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక మండలి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పన, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్పను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా, పూలమాలతో కమిషనర్‌ను ఛైర్‌పర్సన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలిబాషా, వార్డు సభ్యులు గోవిందరాజులు, కోఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, వైసిపి నాయకులు శివ, పట్టణ కన్వీనర్ శివప్ప, వార్డు ఇన్‌ఛార్జి శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, దివాకర్, బషీర్, ఇస్మాయిల్, రామాంజనేయులు, నాయకులు సురేష్, బాబు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

రైతుకు ఆర్థికసాయం

పెద్దపప్పూరు : మండలం చీమలవాగుపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రంగయ్యకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మూడు రోజుల క్రితం రంగయ్య కంది వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని రైతు రంగయ్యను పరామర్శించారు. అనంతరం రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఒక్క ఛాన్స్’తో నట్టేట ముంచిన జగన్

ప్రజాశక్తి-పుట్లూరు



నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

కూలీలతో మాట్లాడుతున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ అన్నివర్గాల ప్రజలనూ నట్టేట ముంచారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో అరటి, సెనగ రైతులు, కూలీలతో మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విపరీతంగా ధరలు పెరగడంతో సామాన్యుల జీవన ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయన్నారు. పేదలు తీవ్ర ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా రైతులకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈనేపథ్యంలో రైతులు, ప్రజలను ఆదుకోవాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, కడవకల్లు గోవర్ధన్ రాజు, చెర్లోపల్లి రవికుమార్, సూరేపల్లి వేణు, కొండాపురం రంగయ్య, ఓబులాపురం హరి, కోమటికుంట్ల రామచంద్రనాయుడు, తాజ్, జయచంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, జెఆర్.పేట బాబు, నారాయణరెడ్డిపల్లె రామమునిరెడ్డి, నరేష్‌రెడ్డి, వడ్డేపల్లి శివారెడ్డి, మడుగుపల్లి హరి, టిడిపి కార్యకర్తలు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీకి నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

కుష్టువ్యాధిపై అవగాహన


గార్లదిన్నె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాలయంలో పిహెచ్‌సి డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో మంగళవారం కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ఫిబ్రవరి 13వతేదీ వరకూ మండల వ్యాప్తంగా కుష్టువ్యాధి ఎలా వస్తుంది.. వాటి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పద్మావతి, దిలీప్‌కుమార్, సీహెచ్ఓ లోకనాథ్, ఎంపిహెచ్ఈఓ నాగేశ్వరయ్య, పిహెచ్ఎన్ అరుణ, సూపర్‌వైజర్లు సూర్యకళ, విశ్వనాథరావు, కృష్ణమోహన్, ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన

బుక్కరాయసముద్రం : మండలంలోని పలు గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని చెన్నంపల్లిలో 113, 114, 115, బొమ్మలాటపల్లిలో 116, 117, దయ్యాలకుంటపల్లి 118, 119, వెంకటాపురం 120, 121, కెకె అగ్రహారం 122, 123, సంజీవపురం 124, రేకులకుంట 125, 126, అమ్మవారిపేట 127 పోలింగ్ బూత్‌ల పరిధిలోని ప్రజలకు కంట్రోల్ యూనిట్, బాలెట్ యూనిట్, వివి.పాట్‌లపై వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారి కె.దామోదరమ్మ, గ్రామ రెవెన్యూ అధికారులు జవహర్‌బాషా, రాధ, రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బాలాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాలాపురం వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌నాయుడు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కొనసాగిన ‘ఇంటింటికీ వైసీపీ’

ప్రజాశక్తి-అనంతపురం



ఎమ్మెల్యే అనంతకు హారతి ఇస్తున్న మహిళలు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేపట్టిన ఇంటింటికీ వైసిపి కార్యక్రమం మంగళవారం నగరంలోని 10వ డివిజన్‌లో కొనసాగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ముందుగా గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సమక్షంలో టీఎన్‌టీయూసీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, తెలుగు యువత మాజీ నాయకులు రవి, టిడిపి కార్యకర్తలు పవన్, రాఘవ, రాజు, లచ్చన్న గౌడ్, రామ్మోహన్ చౌదరి, భరత్, వినోద్, మోహన్, అనిల్ తదితరులు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ వైసీపీ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. అంతేగాకుండా జగన్ సీఎంగా ఉంటేనే తమ జీవితాలు బాగుపడతాయని చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో మరోసారి వైసీపీ విజయం సాధించడం తథ్యమన్నారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు

శింగనమల : సేంద్రీయ ఎరువులు వాడటం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఎస్‌ఎం ముబీనా సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సోదనపల్లిలో సేంద్రీయ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముబీనా మాట్లాడుతూ అధిక మంది రైతులు రసాయన ఎరువులు వాడి దిగుబడి రాకపోవడంతో నష్టాలపాలవుతున్నారన్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కావున అధిక ఖర్చులు తగ్గించి సేంద్రీయ ఎరువులతో ఆరుతడి పంటలు వేసుకుని అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతు కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి

గుత్తి : నియోజకవర్గంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని తిరిగి లక్ష ఓట్ల మెజార్టీతో రెండోసారి గెలిపించేందుకు శాయశక్తులా పని చేస్తామని వైసిపి జిల్లా నాయకులు క్రషర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దొడ్డి ఎస్సీ కాలనీలో వైసిపి నాయకులు పర్యటించారు. ఇందులో భాగంగా ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌ను మరోసారి, వైవిఆర్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కె.మధుసూదన్‌రెడ్డిని పలువురు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సివి.రంగారెడ్డి, బి.శ్రీనివాసులుయాదవ్, బోయగడ్డ రాము, నరేష్, వీరాంజి, నాగేష్, చిన్ననారాయణ, రామచంద్ర, చిరంజీవి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



వైసిపి జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



మృతిచెందిన లక్ష్మీదేవి

నార్పల : మండల కేంద్రంలోని మహిళా మార్ట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. వివరా ల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన కాటంరెడ్డి భార్య లక్ష్మీదేవి (70) ఇంటి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే బంధులువు, స్థానికులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయి తే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. విషయం తెలుసుకున్న బంధువులు భారీగా స్థానిక ఆసుపత్రికి చేరుకు న్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి కారణమైన హస్సేన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పి.యాలేరు రోడ్డులో ఉన్న వెంకట్ ఆగ్రో ట్రేడర్స్‌ను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు రవి, అనంతపురం మండల వ్యవసాయ అధికారిణి జి.సుచరిత కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా విక్రయిస్తున్న 175 ఎరువుల బస్తాల అమ్మకాలను నిలిపివేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఎరువుల దుకాణంలో తీసుకున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. తర్వాత పంపనూరులో రబీ-2023 ఈ-క్రాప్ బుకింగ్‌కు సంబంధించిన పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ సుచరిత, ఎఇఒ సుజిత, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ, చామలూరు సిద్ధిరాచర్ల గ్రామాల్లో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొందలవాడలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, సిద్ధరాచెర్లలో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గుత్తి : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ జి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, మున్సిపల్ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

బ్యాంకుసేవలపై అవగాహన

బెలుగుప్ప : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో రిజర్వ్ బ్యాంకు ఉపయోగాలు, ఎలక్ట్రానిక్స్ లావాదేవీలపై రిజర్వ్ బ్యాంకు అధికారులు మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలోని అన్ని బ్యాంకుల లావాదేవీలు రిజర్వ్ బాంకు ఆధ్వర్యంలోనే జరుగుతాయన్నారు. ఆన్‌లైన్ లావాదేవాల ద్వారా సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. అనంతరం ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యరాజన్, ఎంఇఒ మల్లారెడ్డి, ఎస్ఓ నాగరత్న బాయి, ట్రైనర్ నాగరాజు, రిజర్వ్ బ్యాంకు సిబ్బంది, కస్తూరిబా సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా 9వ వార్డులో నిర్మిస్తున్న కల్వర్టు, 18వ వార్డులో సీసీ రహదారి, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య, ఎఇ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పప్పూరులో ‘జయహో బీసీ’



జయహో బిసి సదస్సులో పాల్గొన్న నాయకులు

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ బీసీలకు వెన్నుదన్నుగా నిలిచింది టిడిపినే అన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ టిడిపికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ,టీడీపీ జిల్లా నాయకులు వెంకట్ నరసానాయుడు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, మండల కన్వీనర్ జనసేన నాయకులు రామకృష్ణ, తుపాకుల భాస్కర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర


బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం, విరుపాపల్లి, బూదివర్తి గ్రామాల్లో మంగళవారం మారెమ్మ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవార్లకు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి 12 గంటలు దాటాక అమ్మవారికి దున్నపోతును బలి ఇచ్చారు.

విశాఖ డిపిటిఒపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం : కార్మికులపై నియంతృత్వ, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న విశాఖపట్నం జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి (డిపిటిఒ)పై చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి గ్యారేజీ గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.నాగరాజు, డిపో కార్యదర్శి హెచ్‌టి.స్వామి రీజినల్ వైస్ ప్రెసిడెంట్ దామోదర్, రీజినల్ ఆర్గనైజ్ సెక్రటరీ రవికుమార్‌నాయక్, డిపో అధ్యక్షులు జిలాన్, డిపో కార్యదర్శి తిప్పేస్వామి, గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, ప్రచార కార్యదర్శి రెడ్డి, ఎర్రిస్వామి, అనిల్‌కుమార్, రాజు, నారాయణ, మస్తాన్, వన్నూరుస్వామి, సూరిబాబు, ఆంజనేయులు, వెంకటేశులు, గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బుక్కరాయసముద్రం : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులను వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఎపిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి వ్య.కా.సం కార్యదర్శి ఎ.నాగలింగమయ్య మాట్లాడుతూ కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించడంతోపాటు రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్య.కా.సం గ్రామ కార్యదర్శి భాగ్యమ్మ, సుశీలమ్మ, వెంకట్రాముడు, లక్ష్మీదేవి, నీరజ, వనిత, యల్లమ్మ, కుమారి, అరుణ, ప్రమీలమ్మ, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఎపిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు